

గుడి చుట్టూ దందా

పాల్వంచ శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారి ఆలయ పరిసర ప్రాంతాల్లో వందల సంఖ్యలో బెల్ట్‌షాపులు ఏర్పాటయ్యాయి. 10లో



రైతన్నకు అండదండగా..

రైతులు అధిక దిగుబడి సాధించేలా మధిర వ్యవసాయ పరిశోధనా స్థానం నూతన వంగడాలకు రూపకల్పన చేస్తోంది. 8లో



వాతావరణం

జిల్లాలో ఆదివారం ఉదయమే ఎండ మొదలై మధ్యాహ్నానికి మరింతగా పెరుగుతుంది. ఉక్కపోత వాతావరణం ఉంటుంది.

న్యూస్‌రీల్

వైభవంగా బాలాజీ వేంకటేశ్వర స్వామి కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

అన్నపురెడ్డిపల్లి : మండల కేంద్రంలో కొలువు దీరిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి ఉదయం పంచామృత అభిషేకం, అర్చనలు గావించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు ప్రసాదాచార్యులు వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా స్వామి, అమ్మవార్ల కల్యాణం జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

రామాలయం గోశాలకు విరాళం



దాతలకు రశీదు ఇస్తున్న ఉద్యోగులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం సన్నిధిలో నిర్వహిస్తున్న గోశాలకు ఏపీకి చెందిన భక్తులు శనివారం విరాళం అందజేశారు. గుంటూరు జిల్లా మేడికొండూరు వాసి ఆచంటి హరికృష్ణ రూ.లక్ష గోదానం నిమిత్తం ఆలయ అధికారులకు సమర్పించగా వారు దాతలకు రశీదు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు లింగాల సాయిబాబు, దాతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. కాగా, శ్రీ సీతారామ చంద్రస్వామి వారిని వరంగల్ జిల్లా పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూలమూర్తులకు పూజలు చేసి ఉపాలయాలను దర్శించుకోగా పండితులు శ్రీ లక్ష్మీ తాయారు అమ్మవారి ఆలయంలో వేదాశీర్వచనం, ప్రసాదాలు, జ్ఞాపిక అందజేశారు.

శాశ్వత నిత్యాన్నదానానికి..

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి మేడ్చల్ జిల్లా మల్కాజ్‌గిరికి చెందిన భాస్కర మధుసూదన రావు–కామాక్షి దంపతులు రూ.లక్ష చెక్కును ఆలయ అధికారులకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా దాత కుటుంబ సభ్యులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

రామయ్య సేవలో సీటీసీ చీఫ్ కమిషనర్

భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని సెంట్రల్ టాక్స్ అండ్ కస్టమ్స్ చీఫ్ కమిషనర్ సందీప్ ప్రకాష్ శనివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు స్వామివారి జ్ఞాపిక, ప్రసాదం అందజేశారు.

రేపటి గిరిజన దర్బార్ రద్దు

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించే గిరిజన దర్బార్‌ను రాఖీ పౌర్ణమి సందర్భంగా ఈ సోమవారం రద్దు చేసినట్లు పీఓ బి.రాహుల్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గిరిజనులు ఈ విషయాన్ని గమనించి వినతులు ఇచ్చేందుకు రావొద్దని సూచించారు.

టర్బయిన్ రీడిజైన్ పనుల్లో పురోగతి

జీఎం(ఆర్అండ్‌డీ) సైదులు వెల్లడి

మణుగూరు టౌన్: మణుగూరు మండలం పగిడేరులో ప్రారంభించనున్న జియోథర్మల్ టర్బైన్ రీడిజైన్ పనులు పురోగతిలో ఉన్నాయని జీఎం(ఆర్అండ్‌డీ) సైదులు తెలిపారు. శనివారం ఆయన మణుగూరులో పర్యటించారు. జియోథర్మల్ ప్రాంతాన్ని ఏరియా జీఎం దుర్గం రాంచందర్‌తో కలిసి పరిశీలించారు. కాగా, తొలిసారి మణుగూరు ఏరియాలో పర్యటించిన జీఎంను అధికారులు ఘనంగా సన్మానించారు.

లైజన్ సెల్ ఇన్‌చార్జిగా అజయ్‌కుమార్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ లైజన్ సెల్ ఇన్‌చార్జి అధికారిగా ఐఆర్ వింగ్ డీజీఎం అజయ్‌కుమార్‌ను నియమిస్తూ శనివారం సింగరేణి యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు సంబంధించిన బాధ్యతలను పర్సనల్ (ఐఆర్‌పీఎం) జీఎం నుంచి పొందాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. కాగా సంస్థలో పనిచేసే ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ఈ అధికారి పాత్ర కీలకంగా ఉంటుంది.

కనకగిరికి పూర్వ వైభవం !

చంద్రుగొండ: మండల కేంద్రానికి సరిగ్గా ఆరు కిలోమీటర్ల దూరంలో విస్తరించి ఉన్న కనకగిరి గుట్టలు పూర్వ వైభవాన్ని సంతరించుకోనున్నాయి. ఇక్కడ కాకతీయుల కాలంలో నిర్మించిన కట్టడాలు కనుమరుగవుతుండగా.. ఇన్నాళ్లకు అభివృద్ధికి మార్గం సుగమమవుతోంది. మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన బెండాలపాడు శివారులో ఉన్న కనకగిరి గుట్టలు చారిత్రక చిహ్నాలకు నిలయంగా ఉన్నాయి. నాటి కాకతీయ రాణి రుద్రమదేవి తన సామ్రాజ్యంలో భాగంగా ఈ ప్రాంతాన్ని ఎంచుకుని శత్రుదుర్భేద్యమైన కోట, అందులో కోశాగారం నిర్మించారని చారిత్రక కథనం. కోట ప్రాంగణంలో నీటి సదుపాయం కోసం కోనేరు నిర్మించారు. ఇప్పటికీ ఆ కోనేరులో నీళ్లు పుష్కలంగా ఉండటం విశేషం. సుమారు 25 కిలోమీటర్ల వరకు విస్తరించి ఉన్న గుట్టల చుట్టూ రెండంచెల రక్షణ వలయాలు నిర్మించారు. గుట్ట కింది భాగంలో బోగందానిగుళ్లు, ఆంజనేయస్వామి, హస్తాల వీరన్న స్వామి ఆలయాలు ఉన్నాయి. గుట్టపై ఉన్న వీరభద్రుడి ఆలయంతో పాటు కింద ఉన్న హస్తాల వీరన్న ఆలయాలను నిత్యం భక్తులు దర్శించుకుంటున్నారు.



పులిగుండాల ప్రాజెక్ట్ సమీపంలోని కనకగిరి గుట్టలు

- చారిత్రక చిహ్నాల అభివృద్ధికి బాటలు
- పర్యాటక కేంద్రాలుగా మారనున్న గుట్టలు
- రూ.600 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

రూ.600 కోట్లతో అభివృద్ధి..

కనకగిరి గుట్టల ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని టూరిజం శాఖ ప్రభుత్వానికి పలుమార్లు ప్రతిపాదనలు పంపించింది. ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కనకగిరి ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు రూ.600 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులు వెచ్చించి చంద్రుగొండ, కల్లూరు, తల్లాడ, జూలూరుపాడు మండలాల మధ్య విస్తరించి ఉన్న కనకగిరి గుట్టలను

సండే స్పెషల్

పర్యాటక కేంద్రంగా మారిస్తే ఈ ప్రాంత అభివృద్ధికి సైతం అవకాశం ఏర్పడుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పనులు త్వరగా చేపట్టి సకాలంలో పూర్తి చేయాలని కోరుతున్నారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు

రాణి రుద్రమదేవి ఈ ప్రాంతంలో కోశాగారం ఏర్పాటు చేసినట్లు కథనాలు ప్రచారంలో ఉన్నాయి. దీంతో కనకగిరి గుట్టలపై గుప్తనిధుల కోసం నిత్యం తవ్వకాలు సాగుతుంటాయి. హస్తాల వీరన్న, బోగందానిగుళ్లు, ఆంజనేయస్వామి ఆలయాల కింది భాగాల్లో తవ్వకాలు జరపడంతో చారిత్రక నిర్మాణాలు ఛిద్రమయ్యాయి. ఇది దట్టమైన అటవీ ప్రాంతంలో ఉండడంతో అధికారుల పర్యవేక్షణ సైతం కొరవడుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కనకగిరి గుట్టల ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తే ఇలాంటి వారి ఆట కట్టించవచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు.



కనకగిరి గుట్టల ప్రవేశమార్గం



నేటికీ పూజలందుకుంటున్న హస్తాల వీరన్న స్వామి

ఇన్నాళ్లకు కల సాకారం



కనకగిరి గుట్టల ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ఎప్పటి నుంచో కోరుతున్నాం. ఇన్నాళ్లకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తూ నిర్ణయించడం హర్షణీయం. ఇప్పటికైనా మా కల సాకారం అవుతున్నందుకు సంతోషంగా ఉంది.

– ఈసం నాగభూషణం, పల్లేరు వీరభద్రం స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు, బెండాలపాడు

అభివృద్ధి చెందితే ఆదాయం



గుట్టలపై ఉన్న కాకతీయుల కట్టడాలు పర్యాటకులను ఆకట్టుకుంటాయి. వాటిని మరింత అభివృద్ధి చేస్తే ఈ ప్రాంతానికి ఆదాయం పెరుగుతుంది. ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం శుభపరిణామం. పనులు త్వరగా ప్రారంభించాలి.

– బొర్రా సురేష్, వీరభద్రస్వామి శివరాత్రి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, బెండాలపాడు

ఆనవాళ్లు శిథిలమవుతున్నాయి



కనకగిరి గుట్టల ప్రాంతంలోని కాకతీయుల కట్టడాలు ఆనవాళ్లు కోల్పోతున్నాయి. గుప్త నిధుల వేటగాళ్లు కట్టడాలను కూల్చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం సంతోషకరం. అభివృద్ధి చేస్తే ఈ ప్రాంతం పర్యాటక కేంద్రంగా వర్ధిల్లుతుంది.

– మల్లం కృష్ణయ్య, ఆదివాసీ సంఘం నాయకుడు, బెండాలపాడు

57,983 మంది రైతులకు రుణమాఫీ

కలెక్టర్ జితేష్ వి పాటిల్ వెల్లడి



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్, పక్కన డీఈఓ తదితరులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో మూడు విడతల్లో కలిపి 57,983 మంది రైతులకు రూ. 415,34,84,332 రుణమాఫీ అయిందని కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన వివరాలు వెల్లడించారు. మొదటి విడతలో 28,801 మంది రైతులకు రూ.136,64,86,132, రెండో విడతలో 17,309 మంది రైతులకు రూ. 147,33,79,632, మూడో విడతలో 11,873 మంది రైతులకు రూ. 31,36,18,568 రుణమాఫీ అయిందని వివరించారు. ఈ నగదును రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు.

సమస్యలుంటే ఫిర్యాదు చేయండి..

రుణమాఫీ విషయంలో ఏమైనా సమస్యలు ఉంటే రైతులు ఫిర్యాదు చేయొచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..

- మండలంలో ఉన్న అన్ని బ్యాంకుల శాఖలు/సహకార సంఘాల రుణాలకు మండల వ్యవసాయాధికారి బాధ్యత వహిస్తారు.
- ఆధార్ నంబర్ తప్పుగా ఉంటే మండల వ్యసాయాధికారులు తప్పనిసరిగా రైతు నుంచి ఆధార్ కార్డు కాపీని పొందాలి. పోర్టల్‌లో సరైన ఆధార్ కార్డును అప్‌లోడ్ చేయాలి. ఓటరుకార్డు, వాహన లైసెన్స్, రేషన్ కార్డు వంటి ప్రత్యామ్నాయ గుర్తింపు పత్రాన్ని సేకరించి అప్‌లోడ్ చేయాలి.
- కుటుంబాలు ఇంకా నిర్ణయించని సందర్భాలలో మండల వ్యవసాయాధికారులు తప్పనిసరిగా రైతు ఇంటిని సందర్శించి రైతు వెల్లడించిన ఆధార్ కాపీలు, కుటుంబ సభ్యుల సంఖ్యను తప్పనిసరిగా తీసుకోవాలి. కుటుంబ వివరాలను పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి.
- రైతులకు పాసుబుక్ లేకుంటే తీసుకున్న తర్వాత దాన్ని పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి.

ఉపాధ్యాయులే మార్గ నిర్దేశకులు

కొత్తగూడెంఅర్బన్: విద్యార్థుల భవిష్యత్‌కు ఉపాధ్యాయులే మార్గ నిర్దేశకులని, తల్లిదండ్రులకు పిల్లల చదువు పట్ల ఆసక్తి కలిగించాల్సిన బాధ్యత టీచర్లపైనే ఉందని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కొత్తగూడెంలోని జిల్లా విద్య శిక్షణ కేంద్రంలో శనివారం నిర్వహించిన వర్క్ షీట్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పెంచడానికి ఇంటి పనిగా వర్క్ షీట్లు అందిస్తున్నామని తెలిపారు. జిల్లాలో మొదట 48 ప్రాథమిక పాఠశాలలను ఎంపిక చేసి, వారికి ముందుగా ప్రారంభ పరీక్ష నిర్వహించి ఫలితాలు సేకరించాలని సూచించారు. సానుకూల ఫలితాలు వస్తే ఈ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా అమలు చేస్తామని తెలిపారు. రెండు నుంచి 5వ తరగతి విద్యార్థులకు తెలుగు, గణితం, ఆంగ్ల భాషలకు సంబంధించిన వర్క్ షీట్లను తయారు చేయించి విద్యార్థులకు అందిస్తున్నామని వివరించారు. డీఈఓ ఎం. వెంకటేశ్వరాచారి మాట్లాడుతూ పిల్లలకు వర్క్ షీట్లను ఇంటి పనిగా ఇవ్వడంతో ఉపాధ్యాయులపై ఎలాంటి భారం పడదని, అంతేగాక ఆకర్షణీయంగా ఉన్న ఈ వర్క్ షీట్లను విద్యార్థులు ఉత్సాహంగా ఇంటి వద్ద పూర్తి చేస్తారని చెప్పారు. జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి నాగరాజశేఖర్ వర్క్ షీట్లను ఉపయోగించే విధానంపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపిక చేసిన 48 ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలికల మెనూపై న్యాయమూర్తి ఆరా



ఆశ్రమ పాఠశాలను పరిశీలిస్తున్న న్యాయమూర్తి కీర్తి చంద్రికారెడ్డి

ఇల్లెందు: పట్టణంలోని గోవింద్ సెంటర్‌లో గల గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను ఇల్లెందు కోర్టు న్యాయమూర్తి దేవరపల్లి కీర్తి చంద్రికా రెడ్డి శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు అందుతున్న మెనూపై ఆరా తీసి, సదుపాయాలు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. మెనూలో నాణ్యత పాటించాలని, వంటశాలలు, నివాస గదులను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రతలు తీసుకోవాలన్నారు. ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరాలు నిర్వహించేలా చూడాలని హెచ్‌ఎం పద్మావతిని కోరారు. మౌలిక వసతుల కల్పనలో ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. న్యాయమూర్తి వెంట బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కాంపెల్లి ఉమామహేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి కీర్తి కార్తీక్ తదితరులు ఉన్నారు.

మట్టి పరీక్షలు చేయించాలి

అసిస్టెంట్ సాయిల్ సర్వే అధికారి సురేష్

గుండాల: పంటల సాగులో అధిక లాభాలు గడించేందుకు ప్రతీ రైతు మట్టి నమూనాలు సేకరించి పరీక్షలు చేయించుకోవాలని కేంద్ర వ్యవసాయ శాఖ అసిస్టెంట్ సాయిల్ సర్వే అధికారి వై.సురేష్ అన్నారు. నీతి ఆయోగ్ ఆస్పిరేషన్ బ్లాక్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన మండలంలోని మామకన్ను, ముత్తాపురం, లింగగూడెం గ్రామాలను సందర్శించారు. నీటి కుంటలు, చెక్‌డ్యామ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా మట్టి నమూనా సేకరణపై వ్యవసాయ అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మట్టి నమూనా సేకరణ పరీక్షలు చేయడం ద్వారా సాగు భూమిలో ఏ పంట వేయాలో, ఏ రకమైన ఎరువులు అనుకూలమో తెలుస్తుందని అన్నారు. పంటల సాగుకు పెట్టుబడి ఖర్చు తగ్గుతుందని చెప్పారు.



అధికారులతో మాట్లాడుతున్న సురేష్, పక్కన విద్యాచందన తదితరులు

సాగు భూమిలో నీటి కుంటలు నిర్మించుకుంటే భూగర్భ జలాలు పెరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విద్యాచందన, డీఏఓ బాబూరావు, ఉద్యానవన అధికారి సూర్యనారాయణ, సీపీఓ శ్రీనివాస్, అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.రవి, ఎంపీడీఓ సత్యనారాయణ, ఏపీఓ రవితేజ తదితరులు పాల్గొన్నారు.



కొత్తగూడెంలో అమరవీరుల స్థూపం వద్ద కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

హోరెత్తిన నిరసన

కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై అత్యాచారం, హత్యకు నిరసనగా జిల్లా వ్యాప్తంగా వైద్యులతో పాటు విద్యార్థి, యువజన, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేశారు. దోషులను ఉరి తీయాలని నినదించారు. జిల్లాలోని పలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో సిబ్బంది శనివారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. కొత్తగూడెం జిల్లా కేంద్రంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. దేశంలో మహిళలపై నానాటికీ అఘాయిత్యాలు పెరుగుతున్నాయని, ఉన్నత విద్యావంతులకు సైతం రక్షణ కొరవడుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. దోషులను కఠినంగా శిక్షించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

- వివరాలు 9లో

మాఫీ.. మాయామంత్రం

రుణమాఫీకి పెద్దసంఖ్యలో రైతులు దూరం

- డీసీసీబీ పరిధిలో మూడో వంతు మందికి కూడా జరగని లబ్ధి
- 1.69 లక్షల మందిలో 68 వేల మందికే నగదు జమ
- బ్రాంచ్‌లు, అధికారుల చుట్టూ అన్నదాతల ప్రదక్షిణలు

ఖమ్మంవ్యవసాయం: తీరూ తెన్ను లేదు.. లబ్ధిదారులు ఎవరు, ఎంత మంది అనే స్పష్టత కానరావడం లేదు.. అధికారులను అడిగినా తమ వద్ద పూర్తి సమాచారం లేదంటూ దాటవేత ధోరణి.. ఇవీ రుణమాఫీలో రైతులకు ఎదురవుతున్న అంశాల్లో కొన్ని! వాణిజ్య బ్యాంకుల్లో లెక్కలు అసలే తేలకపోగా ఆ విషయాన్ని పక్కన పెట్టి ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(డీసీసీబీ) పరిధిలో రుణమాఫీని పరిశీలిస్తే పొంతన లేని లెక్కలతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. అధికారిక గణాంకాల ప్రకారం వెల్లడించిన రైతుల్లో కనీసం మూడో వంతు మందికి కూడా మాఫీ జరగకపోవడం అన్నదాతల్లో ఆందోళనకు కారణమవుతోంది.

ఎన్నికలకు ముందు హామీ

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రైతులకు రూ.2లక్షల రుణాలను మాఫీ చేస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. ఆపై అదే పార్టీ అధికారంలోకి రాగా జూలైలో మాఫీకి శ్రీకారం చుట్టడంతో రైతులంతా ఆనందపడ్డారు. ఇక మార్గదర్శకాలు విడుదల చేయగానే పలువురు నిరాశకు లోనయ్యారు. మూడు విడతల్లో రుణమాఫీ చేస్తామని, 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9వ తేదీ వరకు బ్యాంకుల్లో అసలు, వడ్డీ బకాయి జమ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకుని ప్రతీ కుటుంబానికి రూ.2 లక్షల మేర పంటల రుణాలు మాఫీ చేస్తామని, రేషన్ కార్డు, పీఎం కిసాన్ సమ్మాన్ యోజన పథకం లబ్ధిదారులకు వర్తించేలా మార్గదర్శకాలు పొందుపరిచారు. ఇదే సమయాన ప్రభుత్వ ప్రతినిధులు మాత్రం పట్టాదారు పాస్ బుక్ కలిగిన అందరికి రుణమాఫీ వర్తిస్తుందని వెల్లడించారు. ఈ నేపథ్యాన నాలుగు జిల్లాల్లో విస్తరించిన ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(డీసీసీబీ) కూడా రుణమాఫీ జాబితాలను టస్కాబ్‌కు సమర్పించింది.



ఖమ్మం డీసీసీబీ ప్రధాన కార్యాలయం

విడతల వారీగా రుణమాఫీ

విడత	రైతులు	రుణ మాఫీ (రూ.ల్లో)
మొదటి	37,625	121,63,40,360
రెండు	19,504	88,09,04,542
మూడు	11,445	64,66,88,456
మొత్తం	68,574	274,39,33,358



ఈ రైతు బూర్గంపాడు మండలం నాగినేనిప్రోలుకు చెందిన యడమకంటి రవీందర్‌రెడ్డి. డీసీసీబీ, ఏపీజీవీబీ నుంచి రూ.1.60లక్షల వరకు పంట రుణం తీసుకుంటే ఎక్కడా మాఫీ కాలేదు. అధికారులను అడిగితే తమకేం తెలియదని చెప్పారు. గ్రీవెన్స్‌లో దరఖాస్తు ఇచ్చినా ఎప్పుడు పరిష్కారమవుతుందో తెలియదు. రుణమాఫీ అంతా మాయలా ఉందని వాపోతున్న రవీందర్‌రెడ్డి చేసేదేం లేక వ్యవసాయ పనుల్లో ముందుకు సాగుతున్నాడు.

ఆంక్షల పేరిట మంగళం

రైతులు పలువురు రూ.2 లక్షల లోపే రుణం తీసుకున్నా జాబితాల్లో పేరు లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ శాఖ కార్యాలయాలు, కలెక్టరేట్లలో ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ సెంటర్ల వద్దకు పరుగులు తీస్తున్నారు. అధికారులు రుణమాఫీ పోర్టల్‌లో పరిశీలించి వివరాలు వెల్లడిస్తున్నా స్పష్టత రావడం లేదు. మరోపక్క బ్యాంకర్లు మాత్రం రేషన్ కార్డు లేని వారికి రుణమాఫీ కాలేదని.. ఆధార్‌లో ఉన్న పేరు రుణ ఖాతాలోని పేరు సరిపోవడం లేదని కారణాలు చెబుతున్నారు. ప్రభుత్వం మాత్రం గ్రీవెన్స్‌లో దరఖాస్తు చేసుకుంటే అర్హులందరికీ మాఫీ అవుతుందని భరోసా కల్పిస్తున్నా రైతుల్లో నమ్మకం కలగడం లేదు.

డీసీసీబీ పరిధిలో రుణమాఫీకి అర్హులు, సిఫారసు చేసిన నగదు

కేటగిరీ	అర్హులైన రైతులు	రుణం (రూ.ల్లో)
రూ.లక్ష లోపు	1,43,538	528,36,40,953
రూ.1లక్ష నుంచి రూ.1.5లక్షల వరకు	17,821	214,05,20,126
రూ.1.50లక్షల నుంచి రూ.2 లక్షల వరకు	8,505	149,58,42,863
మొత్తం	1,69,864	892.00,03,942

1.69 లక్షల్లో 68వేల మందికే...

డీసీసీబీ ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలతోపాటు మహబూబాబాద్ జిల్లాలోని గార్ల, బయ్యారం, ములుగు జిల్లాలోని వాజేడు, వెంకటాపురంలో విస్తరించి ఉండగా వంద పీఏసీఎస్‌లు, 50 బ్యాంకు బ్రాంచ్‌లు కొనసాగుతున్నాయి. వీటి పరిధిలో ప్రభుత్వ మార్గదర్శకాల ఆధారంగా రుణాలు తీసుకున్న రైతులు 1.69 లక్షల మంది రుణమాఫీకి అర్హులుగా తేల్చారు. వీరు రూ.2 లక్షల వరకు తీసుకున్న రూ.892 కోట్ల రుణాలను మాఫీ చేయాల్సి ఉంటుందని టస్కాబ్‌కు ఇచ్చిన నివేదికలో పొందుపర్చారు. తీరా డీసీసీబీ చేసిన సిఫారసులో మూడో వంతు మందికి కూడా మాఫీ వర్తించలేదు. కేవలం 68,574 మంది రైతులకే రూ.892 కోట్లకు గాను రూ.274 కోట్ల నగదే జమ అయింది.

క్లుప్తంగా

భద్రాద్రి ఫొటోగ్రాఫర్‌కు రాష్ట్రస్థాయి అవార్డు



అవార్డు పొందిన ఫొటోగ్రఫర్ షరీఫ్

భద్రాచలంటౌన్: పట్టణానికి చెందిన ఫొటోగ్రాఫర్ షరీఫ్‌కు రాష్ట్రస్థాయి అవార్డు దక్కింది. ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఐఅండ్ పీఆర్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో రైతు భరోసా, మహాలక్ష్మి, గృహలక్ష్మి, చేయూత, గృహజ్యోతి, ఉత్తమ వార్త చిత్రం విభాగాల్లో పోటీలు నిర్వహించారు. దీంతో షరీఫ్ పంపిన ఫొటో బహుమతికి ఎంపికైంది. అవార్డును అందుకునేందుకు ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా సోమవారం హైదరాబాద్ రావాలని ఐఅండ్‌పీఆర్ శాఖ నుంచి సమాచారం అందిందని షరీఫ్ తెలిపారు.

ట్రస్ట్ పేరుతో సైబర్ మోసం



వాట్సాప్ గ్రూప్‌లోని చాటింగ్ స్క్రీన్‌షాట్

అశ్వారావుపేట: మీరు రూ.2 వేలు చెల్లించి రూ.18,500 తిరిగి పొందండంటూ శనివారం వాట్సాప్ గ్రూపుల్లో వచ్చిన సందేశానికి స్పందించి ఓ వ్యక్తి మోసపోయాడు. దమ్మపేట మండలంలోని విలేకరులు, రాజకీయ నాయకులు, అధికారులకు చెందిన ఓ వాట్సాప్ గ్రూప్‌లోకి ఓ వ్యక్తి ప్రవేశించి అడ్మిన్‌లను తొలగించి రూ.2 వేలు ఫోన్‌పే చేస్తే రూ.18,500 తిరిగి వస్తాయని, హర్షసాయి ట్రస్ట్ నుంచి చెల్లింపులు జరుగుతాయని నమ్మబలికాడు. దీంతో అశ్వారావుపేటకు చెందిన ఎస్‌కే రఫీ రూ.2 వేలు పంపగా, ఆ తర్వాత అతని ఫోన్ నంబర్ బ్లాక్‌లిస్టులో పడింది. విషయాన్ని సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయగా, మిగిలిన వారు అప్రమత్తమయ్యారు. కాగా జరిగిన మోసాన్ని ఫిర్యాదు రూపంలో అశ్వారావుపేట, దమ్మపేట పోలీస్ స్టేషన్లలో తెలుపలేదు.

'విద్యుత్' క్రీడల్లో సత్తా చాటిన జిల్లా ఉద్యోగులు



వాలీబాల్‌లో ట్రోఫీ అందుకుంటున్న ఖమ్మం క్రీడాకారులు

ఆదిలాబాద్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో శుక్రవారం ప్రారంభమైన విద్యుత్ ఉద్యోగుల రాష్ట్రస్థాయి వాలీబాల్, క్యారంబోర్డు క్రీడా పోటీలు శనివారం ముగిశాయి. పోటీల్లో వాలీబాల్ విజేతగా ఖమ్మం ఉద్యోగుల జట్టు నిలిచింది. ఆ తర్వాత రెండు, మూడో స్థానాల్లో మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ జట్లు నిలిచాయి. ఈ మేరకు విజేతలకు ఆదిలాబాద్, నిర్మల్ ఎస్‌ఈలు జేఆర్ చౌహాన్, శ్రీనివాస్ ట్రోఫీలు అందజేసి అభినందించారు.

మహిళ అదృశ్యం

ఇల్లెందు: మండలంలోని వేపలగడ్డ తండాకు చెందిన గుగులోతు లక్ష్మి(35) అదృశ్యంపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. స్కూల్లో ఉన్న పిల్లల వద్దకు వెళ్తున్నానంటూ ఇంట్లో సమాచారం ఇచ్చి వెళ్లిందని, మళ్లీ తిరిగి రాలేదని భర్త వెంకన్న ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బి. సూర్య తెలిపారు.

నలుగురిపై కేసు నమోదు

జూలూరుపాడు: దాడి ఘటనలో నలుగురు వ్యక్తులపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ రాణా ప్రతాప్ కథనం ప్రకారం .. జూలూరుపాడు గ్రామానికి చెందిన నాగేశ్వరరావు, సుజాత దంపతుల మధ్య కొన్నేళ్లుగా గొడవలు జరుగుతున్నాయి. దీంతో కొంత కాలంగా భార్యాభర్తలు వేర్వేరుగా ఉంటున్నారు. శనివారం భార్య సుజాత, కుమారుడు మనోజ్, కోడలు సంధ్య, అత్త గోపమ్మ ఇంటికి వచ్చారు. ఈ క్రమంలో గొడవ జరగడంతో దాడి చేయగా నాగేశ్వరరావుకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

హమాలీపై ట్రాఫిక్ కానిస్టేబుల్ దాడి

ఖమ్మంక్రైం: ఖమ్మం గాంధీచౌక్‌లో హమాలీపై ట్రాఫిక్ కానిస్టేబుల్ దాడి చేసిన ఘటన ఉద్రిక్తతకు దారి తీసింది. వివరాలిలా ఉన్నాయి. లారీ ద్వారా సరుకు దిగుమతి విషయమై గాంధీచౌక్‌లో శనివారం రాత్రి అక్కడ విధులు నిర్వర్తిస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్‌కు, ఓ హమాలీకి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ నేపథ్యాన హమాలీపై కానిస్టేబుల్ దాడి చేయగా ఆయన ముఖంపై గాయాలయ్యాయి. దీంతో తోటి హమాలీలు, వ్యాపారులు కానిస్టేబుల్‌తో గొడవకు దిగడంతో ఉద్రిక్తత నెలకొంది. ఇంతలోనే ట్రాఫిక్ పోలీసు అధికారులు చేరుకుని సర్దిచెప్పడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.

పిచ్చికుక్క దాడిలో నలుగురికి తీవ్రగాయాలు

నేలకొండపల్లి: మండలంలోని కొత్తకొత్తూరులో శనివారం ఓ పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. నలుగురిని కరవడంతో తీవ్ర గాయాలయ్యాయి. గ్రామంలోకి వచ్చిన ఓ పిచ్చి కుక్క కనిపించిన వారి వెంట పడి కరవగా భూక్యా వాసు, కుక్కల నగేశ్, లక్ష్మయ్యతో పాటు బిహార్‌కు చెందిన వలస కూలీకి తీవ్రగాయాలయ్యాయి.

రైతన్నకు అండదండగా...

రైతులకు సాగు అంశాల్లో మెళకువలు వివరించడమే కాక అధిక దిగుబడి సాధించేలా నూతన వంగడాలకు రూపకల్పన చేస్తున్న మధిరలోని వ్యవసాయ పరిశోధనా స్థానం సత్ఫలితాలు నమోదు చేస్తోంది. నిరంతరం పరిశోధనలు సాగిస్తూ చీడపీడలను తట్టుకోవడమే కాక ఎక్కువ దిగుబడి సాధించేలా పలు పంటల వంగడాలను ఇక్కడ రూపొందిస్తున్నారు. తద్వారా రాష్ట్రంలోనే మధిర స్థానం ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. – మధిర


మధిర ఏఆర్‌ఎస్ కేంద్రంగా అన్నదాతలకు సేవలు

- అధిక దిగుబడినిచ్చే వంగడాలకు రూపకల్పన
- ఆధునిక వ్యవసాయంపైనా అవగాహన



మధిర వ్యవసాయ పరిశోధనా స్థానం

సండే స్పెషల్



ఐదేళ్లలో విత్తనాల ఉత్పత్తి (పెసర, మినుము, కందులు క్వింటాళ్లలో)



త్వరలో విడుదల కానున్న ఎంజీజీ-389 పెసర

1945లో పొగాకుతో మొదలు..

గత ఏడు దశాబ్దాలుగా నాణ్యమైన, నమ్మకమైన విత్తనాలను రైతులకు అందించడంలో మధిర వ్యవసాయ పరిశోధనా స్థానం ముందు నిలుస్తోంది. తొలినాళ్లలో ఈ ప్రాంతాన పొగాకు సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉండడంతో 1945లో శాస్త్రవేత్తలు అదే పంటపై పరిశోధనలు జరిపారు. ఆతర్వాత పొగాకు విస్తీర్ణం తగ్గిపోగా.. 1961లో మాఫీ జొన్నపై పరిశోధనలను చేపట్టారు. అనంతరం 1971 నుంచి అపరాలైన పెసర, మినుము, కందిపై పరిశోధనలు మొదలయ్యాయి. ఈ వ్యవసాయ పరిశోధన స్థానం నుంచి విడుదలైన వంగడాలు తెలంగాణలోని అన్ని జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా ప్రాచుర్యం పొందాయి. పదేళ్లుగా విత్తనోత్పత్తి చేస్తూ రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకుంది.

పరిశోధనలు

మధిర ఏఆర్‌ఎస్‌లో ముగ్గురు శాస్త్రవేత్తలు పనిచేస్తున్నారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.రుక్మిణీదేవి పర్యవేక్షణలో ఒక కీటక శాస్త్రవేత్త, ఒక సేద్య విభాగ శాస్త్రవేత్త ఉండగా.. పరిశోధనలు నిత్యం కొనసాగుతుంటాయి. ఈ పరిశోధనా స్థానానికి అనుబంధంగా వ్యవసాయ సాంకేతిక కళాశాలను 2011–2012లో స్థాపించారు. పరిశోధనా శాస్త్రవేత్తలే కళాశాలలోనూ బోధిస్తుంటారు. కాగా, ఈ కేంద్రంలో ప్రధానంగా చీడపీడలను తట్టుకునే రకాల పంటలు, వరి మాగాణుల్లో సాగుకు అనువైన అపరాలతో పాటు పురుగు మందులు, నానో డీఏపీ వాడకం వల్ల ఫలితాలపై పరిశోధనలు జరుగుతున్నాయి.

రైతుల నుంచి 'బై బ్యాక్'

జిల్లాలోని గణేశ్వరం, బొంద్యా తండా, చింతకాని, కొణిజర్ల, బుచ్చిరెడ్డిపాలెం, బస్వాపురం, కృష్ణాపురం తదితర ప్రాంతాల్లో రైతులకు విత్తనాలు అందజేసి పంట ఉత్పత్తులు వచ్చాక తిరిగి సేకరిస్తున్నారు. బై బ్యాక్ విధానంలో మార్కెట్ ధర కంటే ఎక్కువగా ఏఆర్‌ఎస్ ద్వారా చెల్లిస్తారు. అంతేకాక ఆయా విత్తనాలు రైతులు సాగుచేసే సమయాన శాస్త్రవేత్తలు తరచుగా సందర్శించి సూచనలు ఇస్తూ అధికోత్పత్తి జరిగేలా పర్యవేక్షిస్తారు. అంతేకాక విత్తనోత్పత్తి చేసే రైతులను విత్తన ధ్రువీకరణ సంస్థ ద్వారా రిజిస్ట్రేషన్ చేయిస్తుండగా సంస్థ బాధ్యులు సూచనలు ఇస్తున్నారు.

అనేక రకాలు...

ఈ కేంద్రం ద్వారా ఇప్పటికే విడుదలైన పంటల్లో పలు రకాల మంచి ఫలితాలను ఇస్తున్నాయి. పెసరలో ఎంజీజీ-295, ఎంజీజీ-348, ఎంజీజీ-347, ఎంజీజీ-351, ఎంజీజీ-385 విడుదల చేశారు. అలాగే, మినుములో ఎంబీజీ-207, ఎంబీజీ 1070, కందిలో ఎంఆర్ జీ-66, ఎంఆర్‌జీ 1004 రకాలను రూపొందించారు. ఇక జొన్నలో ఇప్పటి వరకు విడుదల చేయగా.. ఇవన్నీ ఉమ్మడి రాష్ట్రవ్యాప్తంగా ప్రాచుర్యం పొందాయి. ఆపై అధిక మొత్తంలో ఉత్పత్తి చేసి ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు ప్రైవేట్ కంపెనీల ద్వారా రైతుల దరికి చేరుస్తున్నారు.

మరికొన్ని కూడా..

చీడపీడలను తట్టుకుని అధిక దిగుబడులను ఇచ్చే పెసర, మినుము రకాలపై ఏఆర్‌ఎస్‌లో నిరంతరం పరిశోధనలు చేస్తున్నారు. తద్వారా అపరాల సాగు విస్తీర్ణం పెంచాలనేది లక్ష్యంగా చెబుతున్నారు. ప్రస్తుతం మధిర ఎంజీజీ-389, ఎంబీజీ-1080 రకాలు పరిశోధన స్థాయిలో ఉండగా త్వరలోనే విడుదల చేయనున్నారు. ఇక పెసరలో ఎంజీజీ-453, మినుములో ఎంబీజీ-1110 విత్తనాలను ఇప్పటికే పరీక్షల నిమిత్తం జిల్లాలకు చేరవేశారు. ఆపై ఎంజీజీ-519, ఎంబీజీ-1113 కూడా విడుదలకు సిద్ధంగా ఉన్నాయని చెబుతున్నారు.

అర్ధచంద్రాకార వలయంలో సూర్యుడు



భగభగ మండే సూర్యుడు వలలో చిక్కాడు. మధ్యాహ్న సమయంలో మండుతున్న సూర్యుడి చుట్టూ వలయం ఏర్పడిన దృశ్యం అశ్వారావుపేటలో ఆవిష్కృతమైంది. రంగురంగులతో ఉన్న ఆ వలయాన్ని మబ్బులు కమ్మేయడంతో అర్ధచంద్రాకారంలో కనిపించింది. దాదాపు గంటపాటు సూర్యుడి చుట్టూ వలయం ఉండటంతో స్థానికులు ఆసక్తిగా వీక్షించారు. –అశ్వారావుపేటరూరల్

23న పాఠశాలల్లో 'స్పేస్ డే'

కొత్తగూడెంఅర్బన్: ఈనెల 23న నేషనల్ స్పేస్ డే సందర్భంగా జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ఘనంగా వేడుకలను నిర్వహించాలని, స్పేస్‌డే పై ప్రముఖులతో విద్యార్థులకు అవగాహన కల్పించాలని డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి ప్రధానోపాధ్యాయులకు సూచించారు. జిల్లా సైన్స్ అధికారి ఎస్.చలపతిరాజుతో కలిసి ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. చంద్రయాన్ –3 మిషన్ విజయవంతమైన సందర్భంగా ప్రతి ఏడాది ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవంగా జరుపుకోవాలని ప్రధాని నరేంద్రమోడీ సూచించారని గుర్తు చేశారు. ఈ క్రమంలో విద్యార్థులు, చరిత్ర ఉపాధ్యాయులకు అంతరిక్ష పరిశోధనలపై అవగాహన కార్యక్రమాలు, పోటీలు ఏర్పాటు చేయాలని తెలిపారు. జిల్లాలోని విద్యార్థులు, ఉపాధ్యాయులు 'భారత్ ఆన్ ది మూన్' వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేయాలని, ఇందులో అంతరిక్ష పరిశోధన కార్యక్రమాల వీక్షణకు వీలు కలుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థులకు అంతరిక్ష పరిశోధనలపై క్విజ్ పోటీలు, స్పేస్-సైన్స్ పై పోస్టర్ మేకింగ్ పోటీలు నిర్వహించాలని సూచించారు. పోస్టర్ పూర్తిగా చేతితోనే రూపొందించాలని తెలిపారు. ప్రతి పాఠశాలలో తప్పనిసరిగా ఈ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. వివరాలకు 9247296012 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

హాస్టళ్ల నుంచి వెళ్లిపోయిన విద్యార్థులు

దుమ్ముగూడెం : కొత్తపల్లి ఆశ్రమ పాఠశాలలో జరిగిన ఘటన తర్వాత కూడా ఆశ్రమ పాఠశాలల సిబ్బంది అప్రమత్తంగా ఉండటంలేదు. తాజాగా మండలంలోని రెండు హాస్టళ్ల నుంచి ముగ్గురు విద్యార్థులు పరారైన ఘటన శనివారం జరిగింది. లక్ష్మీనగరం గ్రామంలో ఉన్న ఏకలవ్య మోడల్ పాఠశాలలో అడవిరామారం గ్రామానికి చెందిన విద్యార్థి ఇర్ప నరేంద్ర 9వ తరగతి, నారాయణరావుపేట గ్రామానికి చెందిన పాయం మనోహర్ 8వ తరగతి చదువుతున్నారు. శనివారం ఉదయం గ్రౌండ్ వర్క్ సమయంలో ఎవరికీ చెప్పకుండా హాస్టల్ నుంచి వెళ్లిపోయారు. ఆ తర్వాత గుర్తించిన సిబ్బంది తల్లిదండ్రులకు సమాచారం అందించి గాలింపు చేపట్టారు. నరేంద్ర ఇంటికి చేరుకోగా, పాయం మనోహర్‌ను ఆర్లగూడెంలో గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. నారాయణరావుపేట బాలుర ఆశ్రమ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న, మణుగూరుకు చెందిన విద్యార్థి తెల్లం విష్ణు హాస్టల్ నుంచి వెళ్లిపోయాడు. దీంతో సిబ్బంది తల్లిదండ్రులకు సమాచారం అందించి గాలింపు చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎటపాక మండలం కన్నాయిగూడెం గ్రామంలో బంధువుల ఇంటి దగ్గర ఉన్నట్టు గుర్తించి, పాఠశాలకు తీసుకొచ్చారు. తల్లిదండ్రులు ఆదివారం ఆశ్రమ పాఠశాలకు రావాలని సిబ్బంది అందించారు.

రూ. లక్ష విలువైన గుట్కాలు స్వాధీనం



తనిఖీ చేస్తున్న పోలీసులు

టేకులపల్లి: కూల్‌డ్రింక్స్ గోదాంలో అక్రమంగా నిల్వ ఉంచిన గుట్కా ప్యాకెట్లను పోలీసులు శనివారం పట్టుకున్నారు. ఎస్‌ఐ పి.సురేష్ కథనం ప్రకారం.. టేకులపల్లికు చెందిన కిరాణం వ్యాపారి అనబత్తుల రామకోటేశ్వర్‌రావు కూల్ డ్రింక్స్ గోదాంలో శనివారం రాత్రి పోలీసులు తనిఖీలు నిర్వహించారు. రూ. లక్ష విలువైన గుట్కా ప్యాకెట్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పాల్వంచలో..

పాల్వంచరూరల్: కిరాణం దుకాణంలో విక్రయిస్తున్న నిషేధిత గుట్కా ప్యాకెట్లను శనివారం పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని బస్వతారాకకాలనీలో ఉన్న ఓ కిరాణం దుకాణంలో పోలీసులు తనిఖీలు చేశారు. రూ.2,400 విలువైన గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. గుట్కా విక్రేత టి.వీరభద్రంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ.బి.సురేష్ తెలిపారు.

తండ్రిపై కుమారుడి దాడి

అశ్వారావుపేటరూరల్: తండ్రిపై కుమారుడు దాడికి పాల్పడిన ఘటనలో శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై శివరామకృష్ణ కథనం ప్రకారం.. మండలంలోని గోపన్నగూడేనికి చెందిన తండ్రీకొడుకులు కొమరం గోపి, సత్తిబాబు మధ్య కొద్ది రోజులుగా కుటుంబ కలహాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సత్తిబాబు దాడికి పాల్పడినట్లు తండ్రి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రైవేట్ ఆస్పత్రి నిర్వాహకులపై కేసు

ఖమ్మంక్రైం: జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి సిబ్బంది తీరుతో బాలింత ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లగా బాధిత కుటుంబం ఫిర్యాదుతో శనివారం ఖమ్మం టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఖమ్మం రూరల్ మండలం పెదతండాకు చెందిన స్వాతిని గత నెల 27న ప్రసవం కోసం నెహ్రూనగర్‌లోని అంకుర ఆస్పత్రిలో చేర్పించారు. అదేరోజు సిజేరియన్ చేసి పాప పుట్టిందని చెప్పడంతో పాటు తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని తెలిపారు. ఆపై రాత్రి స్వాతి పరిస్థితి విషమించిందని, ప్లేట్‌లెట్లు ఎక్కించాలని చెప్పారు. దీంతో బంధువులు అరగంటలో తీసుకొచ్చే లోగా ఆమెను హైదరాబాద్ తీసుకెళ్లాలని సూచించారు. ఈమేరకు కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ వైద్యులు పరీక్షించి పరిస్థితి విషమించడమేకాక స్వాతి తన పాపను దగ్గరకు తీసుకోలేని పరిస్థితి నెలకొందని.. మరో సర్జరీ చేయాలని చెప్పారు. దీంతో ఆమె మామ గింజల సురేందర్‌రెడ్డి ఖమ్మంలో స్వాతి ప్రసవించిన ఆస్పత్రిపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు సీఐ బాలకృష్ణ తెలిపారు.

బైక్ అదుపు తప్పి బండరాయికి ఢీకొని..

- కుమారుడి మృతి..
- తల్లిదండ్రులు, కూతురుకు తీవ్రగాయాలు



నిరదేష్ (ఫైల్)

గుండాల: తండ్రికి జ్వరం వస్తుండగా పరామర్శించడంతోపాటు తన సోదరులకు రాఖీ కట్టేకుందుకు వెళ్తున్న క్రమంలో ఓ కుటుంబంలో విషాదం మిగిలింది. ద్విచక్ర వాహనంపై ఇద్దరు పిల్లలతోపాటు భార్యాభర్తలు వెళ్తుండగా బైక్ అదుపు తప్పి లోయలో పడింది. దీంతో కుమారుడు మృతి చెందగా, తల్లిదండ్రులకు, కూతురుకు తీవ్ర గాయాలైన సంఘటన శనివారం జరిగింది. మండలంలోని మటంలంక గ్రామానికి చెందిన కల్తి వెంకటేశ్వర్లు, సౌందర్య దంపతులు. సౌందర్య తండ్రికి జ్వరం వస్తుందని తెలియడంతో పరామర్శించడంతోపాటు తన సోదరులకు రాఖీ కట్టేందుకు తన పుట్టినిల్లైన బయ్యారం మండలం లక్ష్మీపురం గ్రామానికి భర్త, కుమారుడు నిరదేష్ (7), కూతురు నేహాలతో శుక్రవారం సాయంత్రం బయల్దేరింది. చెట్టుపల్లి మీదుగా ద్విచక్రవాహనంపై వెళ్తుండగా పాలగండిపై అదుపుతప్పి రోడ్డు దిగి ఓ బండను ఢీకొట్టింది. నలుగురు అక్కడే పడిపోయి తీవ్రగాయాలపాలయ్యారు. అటుగా వెళ్తున్న వాహనదారులు గమనించి క్షతగాత్రులను ఇల్లెందు ప్రభుత్వాసుపత్రికి, అక్కడి నుంచి ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. తల్లిదండ్రులు, కూతురు నేహ చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించడంతో కుమారుడు నిరదేష్‌ను హైదరాబాద్ తీసుకెళ్తుండగా సూర్యాపేట సమీపంలో మృతి చెందాడు. అప్పటివరకు కళ్లముందు ఆడిపాడిన మనువడు ఇకలేడని తెలిసిన నానమ్మ, కుటుంబ సభ్యులు రోదనలు స్థానికులను కంటతడి పెట్టించాయి. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తల్లిదండ్రులకు కుమారుడు మరణవార్త కూడా తెలియని పరిస్థితి. దీంతో మటంలంకలో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా బైక్ ప్రమాదం జరిగాక లోయలో పడిపోయింది.

మృత్యువుతో పోరాడి మృతి..

- నాలుగేళ్ల కిందట గాయపడిన మల్లవరం వాసి
- ఇన్నాళ్లు కోమాలో ఉండగా కన్నుమూత



వెంకటేశ్వరరావు (ఫైల్)

తల్లాడ: నాలుగున్నరేళ్ల కిందట జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలై కోమాలోకి వెళ్లిన రైతుకు రూ.30 లక్షలకు పైగా వెచ్చించి చికిత్స చేయిస్తుండగా చివరకు మృత్యువే విజయం సాధించింది. ఆయన కోలుకుంటాడని భావించిన కుటుంబానికి నిరాశే ఎదురైంది. మండలంలోని మల్లవరానికి చెందిన రైతు బెల్లంకొండ వెంకటేశ్వరరావు (49) 2020 మార్చి 7న బాలాపేట సమీపాన స్కూటీపై వెళ్తుండగా ఎదురుగా వచ్చిన మరో ద్విచక్రవాహనదారుడు ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఆయన తలకు తీవ్ర గాయాలై కోమాలోకి వెళ్లాడు. దీంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్ తీసుకెళ్లి వైద్యం చేయించారు. ఆపై ఇంటికి తీసుకొచ్చి అన్నవాహికలో రంధ్రం ద్వారా నాలుగున్నరేళ్లుగా ద్రవ పదార్థాలు తాగిస్తూ కంటికి రెప్పలా కాపాడారు. కరీంనగర్, ఖమ్మం ఆస్పత్రుల్లో కూడా చికిత్స చేయిస్తూ వెంకటేశ్వరరావు భార్య శివకుమారి బంధువుల సహకారంతో భర్తకు సేవలందించింది. ఇప్పటికే ఆయన చికిత్స కోసం కొంత పొలం అమ్మడమేకాక మరి కొంత తాకట్టు పెట్టి రూ.30 లక్షలకు పైగా ఖర్చు చేసినా ఫలితం లేక వెంకటేశ్వరరావు కోమాలోనే ఉండగా శనివారం మృతి చెందాడు. ఈ ఘటనతో గ్రామంలో విషాదం అలుముకుంది.

రైలు ప్రమాదంలో కల్లూరు యువకుడు...



సలీమ్ (ఫైల్)

కల్లూరు: వరంగల్ రైల్వేస్టేషన్ సమీపాన శనివారం జరిగిన రైలు ప్రమాదంలో కల్లూరుకు చెందిన ఎస్‌కే సలీమ్ (18) మృతి చెందాడు. కల్లూరు యూపీఎస్ రోడ్డులో నివాసముంటున్న ఎస్‌కే పాషా - ఉస్సేన్‌బీ దంపతుల పెద్ద కుమారుడు సలీమ్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి ఆయన పని నిమిత్తం హైదరాబాద్ వెళ్తుండగా శనివారం తెల్లవారుజామున వరంగల్ రైల్వే స్టేషన్ సమీపంలో కాలుజారి రైలు నుంచి కింద పడగా తీవ్రగాయాలతో మృతి చెందాడు. అదే సమయాన ఆయన ఫోన్‌కు తల్లి ఫోన్ చేయగా రైల్వే పోలీసులు మాట్లాడి ఘటన వివరాలు వెల్లడించారు. అనంతరం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం సలీమ్ మృతదేహాన్ని కుటుంబ సభ్యులు కల్లూరు తీసుకొచ్చారు. జీవనోపాధి కోసం వెళ్లిన కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

పాఠశాలలోని భోజనశాలకు మరమ్మతులు



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు

అన్నపురెడ్డిపల్లి: పూర్వ విద్యార్థులు, గ్రామస్తులు పాఠశాలలోని భోజనశాల మరమ్మతులకు సహకరించడం అభినందనీయమని జిల్లా క్వాలిటీ కో–ఆర్డినేటర్, ఏఎంఓ నాగరాజశేఖర్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని ఎర్రగుంట జెడ్పీ పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. హెచ్‌ఎం ఆనంద్ చొరవతో నిరుపయోగంగా ఉన్న భోజనశాల మరమ్మతులకు పూర్వవిద్యార్థులు, గ్రామస్తుడు వి.రమణ సహకారం అందించారని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులు, గ్రామస్తులు విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునందారెడ్డి, శాంతకుమారి, రాజ్యలక్ష్మి, జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

లిఫ్ట్‌లో పడి వ్యక్తికి గాయాలు

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని హరిత హోటల్‌లో శనివారం ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి లిఫ్ట్‌లో పడి గాయాలపాలయ్యాడు. హోటల్ అధికారులు, భద్రాచలం ప్రభుత్వాస్పత్రి వైద్యుల సమాచారం ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన రామానుజం అనే వ్యక్తి శుక్రవారం కుటుంబ సభ్యులతో కలిసి భద్రాద్రి రామయ్యను దర్శించుకున్నాడు. శనివారం ఉదయం హోటల్ రూమ్‌కు వచ్చి తిరుగుప్రయాణం అయ్యే క్రమంలో ఫోన్‌లో మాట్లాడుకుంటూ లిఫ్ట్ డోర్‌ను బలవంతంగా తెరవడంతో ఒక్కసారిగా లిఫ్ట్ కింద భాగంలో పడిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి చికిత్స అందించారు. బాధితుడి విన్నపం మేరకు హైదరాబాద్‌కు రిఫర్ చేశారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



పోలీసులు గుర్తించిన మృతదేహం

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లోని సెయింట్ మేరీస్ పాఠశాల ఎదురుగా ఉన్న ఒకేషనల్ కాలేజీ సమీపంలో ఉన్న సందులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని శనివారం పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. మృతుడి వివరాలు తెలిస్తే 87126 82020 నంబర్‌కు సమాచారం అందించాలని వన్‌టౌన్ సీఐ ఎం.కరుణాకర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



ఈశ్వర్ (ఫైల్)

చర్ల: మండలంలోని మామిడిగూడెం శివారులో శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. సీఐ రాజువర్మ కథనం ప్రకారం.. దుమ్ముగూడెం మండలం బీమవరానికి చెందిన అపకా ఈశ్వర్ (22) ములుగు జిల్లా వెంకటాపురానికి వెళ్లి తిరిగి ద్విచక్ర వాహనంపై వస్తుండగా మామిడిగూడెం శివారులో ఉన్న కల్వర్టును ఢీకొట్టాడు. దీంతో స్థానికులు గమనించి సత్యనారాయణపురం వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

గుండెపోటుతో రైతు...

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధి సోమవరం గ్రామానికి చెందిన రైతు వెంకయ్య శనివారం గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన మృతదేహం వద్ద ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ నివాళులర్పించి కుటుంబీకులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట ఏదునూరి సీతారాములు, కర్నాటి నంది, గొల్లపూడి కృష్ణారావు, పాదిలి హరినాథ్, బొళ్ల గంగారావు, పమ్మి అశోక్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా...

వైద్యుల భద్రతకు ప్రత్యేక చట్టం తేవాలి



సాక్షి, హైదరాబాద్: దేశంలో వైద్యుల భద్రత దృష్ట్యా ప్రత్యేక చట్టం తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వానికి బీజేపీ నేత, మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ విజ్ఞప్తి చేశారు. దేశంలోని అన్ని ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రుల పరిధిలో ఒక పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసి వైద్యులకు భద్రత కల్పించాలని సూచించారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ చికిత్స పొందుతూ రోగులు చనిపోతే.. అందుకు వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆసుపత్రులపై దాడులు చేయడం సబబు కాదన్నారు. కోల్‌కతా వైద్యురాలిపై హత్యాచారం కేసులో దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు.

వైద్య, ఆరోగ్య శాఖలో 3 కొత్త హెచ్‌వోడీ పోస్టులు

సాక్షి, హైదరాబాద్: వైద్య, ఆరోగ్య శాఖలో ఇన్‌చార్జుల వ్యవస్థకు స్వస్తి పలుకుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ శాఖ పరిధిలో డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, వైద్య విధాన పరిషత్ కమిషనర్, డ్రగ్ కంట్రోల్ డైరెక్టర్ పోస్టులను మంజూరు చేస్తూ ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీచేసింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక ఈ మూడు పోస్టులను మంజూరు చేయకపోవడంతో పదేళ్ల పాటు ఈ పోస్టుల్లో పనిచేసిన అధికారులు ఇన్‌చార్జులుగానే కొనసాగారు. ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా జారీ చేసిన తాజా ఉత్తర్వులతో రెగ్యులర్ హెచ్‌వోడీలు రానున్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- భట్టి, పొన్నంను కలిసిన ఆర్టీసీ జేఏసీ నేతలు

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతభత్యాలు అమలు చేస్తూ మాస్టర్ స్కేల్ ఇవ్వాలని, దీర్ఘకాలంగా ఉన్న పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీజీఎస్‌ఆర్టీసీ జేఏసీ కోరింది. ఈ మేరకు శనివారం ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను జేఏసీ నేతలు వెంకన్న, థామస్‌రెడ్డి, మౌలానా, యాదయ్య, సురేశ్, యాదిగిరి తదితరులు కలసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం తెలంగాణ సచివాలయం మీడియా పాయింట్‌లో మాట్లాడారు. ట్రేడ్ యూనియన్లను పునరుద్ధరించాలని కోరారు.



మహబూబ్‌నగర్‌లోని తెలంగాణ చౌరస్తా వద్ద యువ డాక్టర్ హత్యాచార ఘటనపై దృశ్య రూపకంలో నిరసన వ్యక్తం చేస్తున్న జూనియర్ డాక్టర్లు, వైద్య సిబ్బంది



ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షాకు రాఖీ కడుతున్న రిమ్స్ జూనియర్ వైద్యులు



వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీ ఎదుట రక్తపు చేతి మరకలు ఉన్న డాక్టర్ ఆప్రాన్‌ను చూపుతూ నిరసన తెలుపుతున్న జూనియర్ డాక్టర్లు

రాష్ట్రమంతా ఓపీ బంద్

ఐఎంఏ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద వైద్యుల ఆందోళన • రాష్ట్రవ్యాప్తంగా వివిధ రూపాల్లో నిరసన

సాక్షి నెట్‌వర్క్: కోల్‌కతాలో యువ డాక్టర్‌పై హత్యాచారాన్ని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా శనివారం ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఓపీ వైద్య సేవలు నిలిచిపోయాయి. మెడికల్ కాలేజీలు, జిల్లా కేంద్రాల్లో పలు రూపాల్లో డాక్టర్లు, వైద్యసిబ్బంది నిరసన వ్యక్తం చేశాయి. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద ధర్నా చేశారు. పెద్దఎత్తున డాక్టర్లు, వైద్య సిబ్బంది, రాజకీయనేతలు, ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొని సంఘీభావం వ్యక్తం చేశారు. వరంగల్ ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ తాను ఒక ఎంపీగా ఇక్కడకు రాలేదని ఓ వైద్యురాలిగా తన కుటుంబంలో ఒకరిని కోల్పోయిన బాధతో ఇక్కడకు వచ్చినట్టు తెలిపారు. రాబోయే పార్లమెంటు సమావేశాల్లో ఈ అంశాన్ని లేవనెత్తుతానని ఆమె డాక్టర్లకు హామీ ఇచ్చారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ మహిళలపై అత్యాచారాలకు పాల్పడుతున్న వారిని బహిరంగంగా ఉరి తీసినా తప్పు లేదన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పి.కాళీప్రసాదరావు మాట్లాడుతూ డాక్టర్లకు పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలతోపాటు భద్రత కల్పించాలన్నారు. అనేక చట్టాలు ఉన్నా, వాటి అమలు తీరు సరిగ్గా లేకపోవడంతో ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతున్నాయని చెప్పారు. చట్టాల పటిష్ట అమలుతోనే ఇలాంటి సంఘటనలు జరగకుండా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ ప్రధానకార్యదర్శి డాక్టర్ విజయ్‌రావు, ఫైనాన్స్ సెక్రటరీ ఆర్కే.యాదవ్, జాయింట్ సెక్రటరీ డాక్టర్ దయాల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు. ఓపీ మినహా అన్ని రకాల వైద్య సేవలు నిలిచిపోవడంతో వేలాది మంది రోగులు ఇబ్బందులు పడ్డారు. అసలే రోగాల సీజన్ కావడంతో ఓపీకి వచ్చిన వారంతా డాక్టర్ల కోసం ఎదురుచూశారు.

కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట వైద్యుల ధర్నా

వైద్యులు, వైద్య విద్యార్థులు కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట భారీ ఎత్తున ఆందోళనకు దిగారు. జిల్లా వైద్యులు డాక్టర్ బీఎస్.రావు, రఘురామన్, విజయ్ మోహన్‌రెడ్డి, రమణాచారి, చల్మెడ, ప్రతిమ మెడికల్ కళాశాల డాక్టర్లు, పీజీ డాక్టర్లు పాల్గొన్నారు.

పాలమూరులో భారీ ర్యాలీ

ఐఎంఏ, ప్రభుత్వ జూనియర్ వైద్యుల ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రి నుంచి తెలంగాణ చౌరస్తా వరకు భారీర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ నిరసన వ్యక్తం చేశారు. ఆ తర్వాత కలెక్టర్ విజయేందిర బోయికి వినతిపత్రం అందజేశారు.

ఆదిలాబాద్ కలెక్టర్‌కు రాఖీ కట్టిన రిమ్స్ జూడాలు

ఆదిలాబాద్ రిమ్స్ జూనియర్ వైద్యులు కలెక్టర్ రాజర్షి షాకు రాఖీలు కట్టి రక్షణ కల్పించాలన్నారు.

వరంగల్‌లో నిరసన వెల్లువ

వరంగల్‌లో వైద్యులు పెద్దఎత్తున నిరసన తెలిపారు. జూనియర్ వైద్యులు ఓ పక్క విధులు బహిష్కరించి నాలుగు రోజులుగా వివిధ రూపాల్లో నిరసన తెలుపుతున్న క్రమంలో వారికి ఇండియన్ మెడికల్ అసోసియేషన్, నర్సింగ్ విద్యార్థులు వివిధ పార్టీలు మద్దతు తెలిపాయి. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నుంచి కాకతీయ మెడికల్ కళాశాల వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కేఎంసీ ప్రధాన గేటు వద్ద నిరసన తెలిపారు.

తుమ్మిడిహెట్టి వద్ద బరాజ్ సాధ్యం కాదు



- పీసీ ఘోష్ కమిషన్‌కు వి.ప్రకాశ్ వివరణ
- వెదిరె శ్రీరామ్ తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపణ

సాక్షి, హైదరాబాద్: తుమ్మిడిహెట్టి వద్ద బరాజ్ నిర్మాణం సాంకేతికంగా సాధ్యం కాదని తెలంగాణ జలవనరుల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వి.ప్రకాశ్ తేల్చి చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణను తుమ్మిడిహెట్టి కోణంలో కాకుండా మూడు తరాలుగా తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దడానికే ప్రాజెక్టును కేసీఆర్ రీడిజైన్ చేశారనే కోణంలో నిర్వహించాలని కోరారు. జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ఎదుట శనివారం ఆయన స్వచ్ఛందంగా హాజరై తన వాదనలను వినిపించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తుతో బరాజ్ కడితే 5 టీఎంసీల నీళ్లు నిల్వ చేసుకోవచ్చని, అయితే మహారాష్ట్ర 148 మీటర్ల ఎత్తుతో కట్టడానికి మాత్రమే అంగీకారం తెలపడంతో 1.8 టీఎంసీలకు మించి నిల్వ చేసుకోవడానికి వీలు ఉండదని ప్రకాశ్ చెప్పారు. సీడబ్ల్యూసీ లెక్కల ప్రకారం తుమ్మిడిహెట్టి వద్ద 165 టీఎంసీల నీటి లభ్యత ఉంటే అందులో ఎగువ రాష్ట్రాలు వాడుకోని 63 టీఎంసీలూ ఉన్నాయన్నారు. ఈ విషయంలో కేంద్ర జలశక్తి శాఖ సలహాదారు వెదిరె శ్రీరామ్ కమిషన్‌ను తప్పుదోవపట్టిస్తున్నారని ఆరోపించారు.

'వీ'ఆకృతిలో బరాజ్ ఎక్కడా లేదు

తుమ్మిడిహెట్టి వద్ద నిర్మిస్తే వార్ధా-వెన్‌గంగా నదులు కలిసే చోట 'వీ'ఆకృతిలో బరాజ్ వస్తుందని, ప్రపంచంలో ఎక్కడా 'వీ'ఆకృతిలో బరాజ్ లేదని స్పష్టం చేశారు. ప్రతిపాదిత స్థలంలో చాప్రాల్ వైల్డ్ లైఫ్ ప్రాంతం ఉందని, రూ.7,500 కోట్లు వెచ్చించినా తుమ్మిడిహెట్టితో ఆశించిన ప్రయోజనం ఉండదని చెప్పారు. నిజాం హయాంలో తెలంగాణ ప్రాంతంలో 9 ప్రాజెక్టులు ప్రతిపాదించగా, అప్పటి సీఎం నీలం సంజీవరెడ్డి చొరవతో అందులో సాగర్, శ్రీరాంసాగర్‌లను మాత్రమే నిర్మాణం చేపట్టారని, అవి కూడా అసంపూర్తిగా కట్టారని తెలిపారు. 57 ఏళ్లలో తెలంగాణ నాశనం అయిందని, ఈ కారణంగానే జలయజ్ఞం ప్రాజెక్టులను రీ డిజైన్ చేసి, కాళేశ్వరం ఎత్తిపోతల పథకం చేపట్టినట్టు వివరించారు. కాగా బరాజ్ కుంగడానికి కారణాలను తెలుపుతూ ఈ నెల 26లోగా అఫిడవిట్ దాఖలు చేయాలని కమిషన్ ఆదేశించగా 28న సాక్ష్యాధారాలతో సహా నివేదిక ఇస్తానని ప్రకాశ్ వెల్లడించారు.

త్వరలో మాజీ ప్రజాప్రతినిధులకు నోటీసులు



- కాళేశ్వరం బరాజ్‌లపై తుది అంకానికి విచారణ
- ముఖ్య నేత ఇంటికి వెళ్లి విచారించే యోచన!

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లపై విచారణ చివరి అంకానికి చేరడంతో జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోని మాజీ ప్రజాప్రతినిధులకు త్వరలో నోటీసులు జారీ చేయనుంది. ఇప్పటికే నీటిపారుదల శాఖ ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు, ఐఏఎస్ అధికారులు, మాజీ ఐఏఎస్ అధికారుల నుంచి వాంగ్మూలంతో పాటు అఫిడవిట్లను స్వీకరించి పరిశీలించింది. ఈ అఫిడవిట్లలో ఉన్న సమాచారం ఆధారంగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోని ముఖ్యులకు నోటీసులు జారీ చేసి విచారించాలని కమిషన్ నిర్ణయించినట్టు తెలిసింది. గడువులోగా అఫిడవిట్ దాఖలు చేయకుండా కమిషన్ ఆదేశాలను ధిక్కరించిన ఓ మాజీ చీఫ్ సెక్రటరీ స్థాయి అధికారి విచారణకు తాజాగా సమన్లు జారీ చేయాలని కూడా నిర్ణయించింది. కాగా మాజీ ముఖ్యనేత ఒకరు అనారోగ్యంతో ఉన్నారని, విచారణకు హాజరుకాలేరని బీఆర్‌ఎస్ నేత ఒకరు కమిషన్‌కు సమాచారం ఇచ్చినట్టు తెలిసింది. అయితే ఒకవేళ సమన్లు జారీ చేసినా, విచారణకు రానిపక్షంలో కమిషన్ స్వయంగా ఆ నేత నివాసానికి వెళ్లి విచారించాలని భావిస్తున్నట్టు సమాచారం. ఇలావుండగా సాక్షుల క్రాస్ ఎగ్జామినేషన్ ప్రక్రియను వచ్చే వారం నుంచి కమిషన్ ప్రారంభించనుంది. 57 మంది సాక్షులు దాఖలు చేసిన అఫిడవిట్ల ఆధారంగా క్రాస్ ఎగ్జామినేషన్ నిర్వహించనుంది. ఈ ప్రక్రియలో కమిషన్‌కు సహకరించేందుకు తెలంగాణ, ఏపీ, పశ్చిమబెంగాల్‌తో సంబంధం లేని న్యాయవాదిని నియమించాలని కమిషన్ ఇప్పటికే ప్రభుత్వాన్ని కోరింది. క్రాస్ ఎగ్జామినేషన్ ప్రక్రియ ముగిసిన తర్వాత ఆర్థిక అవకతవకలపై కమిషన్ దృష్టి సారించనుంది.

మళ్లీ గడువు పొడిగింపు!

జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ గడువు నెలాఖరుతో ముగియనుంది. అయితే విచారణ ప్రక్రియ ఇంకా కొలిక్కిరాకపోవడంతో ప్రభుత్వం మళ్లీ రెండు నెలలు గడువు పొడిగించే అవకాశాలున్నాయి.

జిల్లా వార్తలు

శాశ్వత అన్నదానానికి రూ.5లక్షల విరాళం



ఈఓకు రూ.5లక్షల చెక్కు ఇస్తున్న కోటేశ్వరరావు

పాల్వంచరూరల్: పాల్వంచ మండలం కేశవాపురం – జగన్నాథపురం మధ్య కొలువైన శ్రీ కనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో నిత్యాన్నదానం ప్రారంభించనున్నారు. ఈమేరకు పాల్వంచలోని గట్టాయిగూడెంకు చెందిన అమరనేని కోటేశ్వరరావు నిత్యాన్నదానం నిర్వహణకు శనివారం రూ.5,00,116 విరాళం అందజేశారు. ఆయనకు ఈఓ ఎన్.రజనీకుమారి రశీదు ఇవ్వగా.. అర్చకులు అమ్మవారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేసి ఆశీర్వదించారు.

పుట్టెడు దుఃఖంలోనూ నేత్రదానం



నేత్రదానం పత్రాలు అందిస్తున్న చిన్నా, తదితరులు

నేలకొండపల్లి: కుమారుడు కన్నుమూశాడన్న ఆవేదనలో ఉన్నప్పటికీ కుమారుడి నేత్రాలు దానం చేయడంతో ఇంకొకరికి చూపు వస్తుందని తెలుసుకున్న తండ్రి తన బాధ్యత నిర్వర్తించాడు. నేలకొండపల్లి మండలం మంగాపురంతండాకు చెందిన గుగులోత్ సంతోష్ ముదిగొండ మండలం గోకినేపల్లి వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ ఘటనతో కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న సంతోష్ తండ్రి గుగులోత్ చిన్నాకు పలువురు నేత్రదానంపై అవగాహన కల్పించారు. దీంతో ఆయన అంగీకరించగా సంతోష్ నేత్రాలను ఖమ్మం నేత్రనిధి బాధ్యులు సేకరించారు. అనంతరం శనివారం గ్రామంలో సంతోష్ అంత్యక్రియలు నిర్వహించారు.

సింగరేణి కార్పొరేట్ సేఫ్టీ జీఎంగా శ్రీనివాస్



చింతల శ్రీనివాస్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ కార్పొరేట్ సేఫ్టీ జీఎంగా చింతల శ్రీనివాస్ శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో జీఎంగా ఉన్న గురువయ్య జూలై 31న ఉద్యోగ విరమణ చేయగా ఆయన స్థానంలో ఆర్జీ–1 జీఎంగా ఉన్న శ్రీనివాస్‌ను నియమించారు. ఈ సందర్భంగా విధుల్లో చేరిన ఆయన మాట్లాడుతూ విలువైన కార్మికుల ప్రాణాలను కాపాడేలా ప్రమాదాల సంఖ్య తగ్గింపునకు కృషి చేస్తామని తెలిపారు. అలాగే, స్వీయరక్షణపై అందరూ దృష్టి సారించి సింగరేణిని ప్రమాదరహితంగా తీర్చిదిద్దడంలో సహకరించాలని కోరారు.

గుడి చుట్టూ దందా

- పెద్దమ్మగుడి సమీపానే బెల్ట్‌షాపులు
- దగ్గరలోనే వైన్స్, ఆ పక్కనే స్టాక్ పాయింట్
- ఫలితంగా ఇబ్బంది పడుతున్న భక్తులు



ఆలయ సమీపాన బెల్ట్‌షాపులో మద్యం సేవిస్తున్న దృశ్యం



పెద్దమ్మగుడి వద్ద స్టాక్ పాయింట్‌లో క్యూ కట్టిన బెల్ట్‌షాపుల నిర్వాహకులు

పాల్వంచరూరల్: భద్రాద్రి జిల్లా పాల్వంచ మండలంలోని శ్రీ పెద్దమ్మతల్లి(కనకదుర్గ) అమ్మ వారి దర్శనానికి ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా చుట్టుపక్కల జిల్లాల నుంచి సైతం భక్తులు వేలాదిగా వస్తారు. అయితే, గుడి సమీపాన ఓ వైన్స్ ఉండగా.. నిర్వాహకులు కొద్దిదూరంలోనే స్టాక్ పాయింట్ ఏర్పాటు చేసుకున్నారు. ఇదిపోను గుడి పరిసర ప్రాంతాలు, సమీప కాలనీలు, గ్రామాల్లో వందల సంఖ్యలో బెల్ట్‌షాపులు ఏర్పాటయ్యాయి. ఆయా షాపుల్లో సమయపాలన లేకుండా విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు చేస్తుండడంతో గుడికి వచ్చే సాధారణ భక్తులు ఇబ్బంది పడుతున్నారు.

ధర లెక్క లేదు...

గుడికి వేలాదిగా వచ్చే భక్తులకు తోడు జాతీయ రహదారి కావడంతో నిత్యం పెద్దమ్మగుడి పరిసరాలు రద్దీగా ఉంటాయి. ఇదే అదనుగా అక్కడి వైన్స్ నిర్వాహకులు భారీ స్టాక్‌తో ఓ పాయింట్ ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి బెల్ట్‌షాపులకు వైన్స్ సరఫరా చేస్తున్నారు. అయితే, వైన్స్‌లో లభించని బ్రాండ్లు కూడా బెల్ట్ షాపుల్లో లభించేలా ఎత్తుగడ వేసి అక్కడ ధర పెంచి అమ్ముతుండడంతో మందుబాబుల జేబులకు చిల్లు పడుతోంది. ఒక్కో మద్యం సీసా క్వార్టర్‌కు ఎమ్మార్పీపై కనీసం రూ.20పైగా ఎక్కువ తీసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. అయితే, ఈ వ్యవహారం ఎక్సైజ్‌శాఖ అధికారులకు తెలిసినా పట్టించుకోకపోవడంతో స్థానికులు వారి తీరును తప్పుపడుతున్నారు.

ఈ విషయమై పాల్వంచ ఎక్సైజ్ సీఐ ప్రసాద్‌ను వివరణ కోరగా.. నిబంధలకు విరుద్ధంగా మద్యం ఎమ్మార్పీ కంటే అధిక ధరకు విక్రయించే షాపుల నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే, పెద్దమ్మగుడి సమీపాన, గ్రామీణ ప్రాంతాల్లో నిబంధనలకు ఏర్పాటైన బెల్టు షాపులు మూసివేయిస్తామని చెప్పారు. ఇక సిండికేట్‌గా ఏర్పడిన కొందరు స్టాక్ పాయింట్ నిర్వహిస్తున్న విషయం తమ దృష్టికి రాలేదని తెలిపారు.

జ్వరాల వ్యాప్తిపై అప్రమత్తంగా ఉండాలి

ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ సన్యాసయ్య

తిరుమలాయపాలెం: సీజనల్ జ్వరాలు నానాటికీ పెరుగుతున్న నేపథ్యాన వైద్య, ఆరోగ్య ఉద్యోగులతోపాటు ఇతర శాఖల ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలని ఖమ్మం ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ సన్యాసయ్య ఆదేశించారు. తిరుమలాయపాలెంలోని మండల పరిషత్ కార్యాలయంలో జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి, డీఎల్‌పీఓ రాంబాబుతో కలిసి శనివారం ఆయన వివిధ శాఖల అధికారులు, వైద్యులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలని, దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. మండలంలో డెంగీ కేసులు ఎక్కువగా నమోదైనందున ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. డెంగీ కేసులు నమోదైన గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించాలని, గ్రామాల్లో తాగునీరు కలుషితం కాకుండా పర్యవేక్షించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ సిలార్‌సాహెబ్, తహసీల్దార్ పీ.వీ రామకృష్ణ, వైద్యులు అలివేలు, వసుంధర తదితరులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న సన్యాసయ్య, పక్కన అధికారులు

డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం కృషి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రాన్ని డ్రగ్స్, మాదకద్రవ్యాల రహితంగా తీర్చిదిద్దేందుకు అంతా ఐక్యం కావాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పిలుపునిచ్చారు. ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ ఖమ్మం జిల్లా కమిటీల ఆధ్వర్యాన భక్తరామదాసు కళాక్షేత్రంలో శనివారం మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఎమ్మెల్సీ మాట్లాడుతూ సమాజంలో డ్రగ్స్ వాడకం పెరుగుతున్న నేపథ్యాన కట్టడిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించడం అభినందనీయమని అన్నారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ బి.కృష్ణ మాట్లాడుతూ..డ్రగ్స్ మాఫియా ప్రధానంగా విద్యార్థులు, యువకులను లక్ష్యంగా చేసుకుంటోందని తెలిపారు. ఈ మేరకు తల్లిదండ్రులు పిల్లల నడవడికపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడారు. ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శులు ప్రవీణ్, బషీరుద్దీన్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో డీవైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్, సైకాలజిస్ట్ ఎం.సతీష్, వైద్యులు సి.భారవి, కె.అనిల్‌తో పాటు శేషగిరిరావు, చింతల రమేష్, సంగీత, సత్య, సుజాత, శీలం వీరబాబు, సత్తెనపల్లి నరేష్, కూరపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులు.. నిత్యవిద్యార్థులు



హైకోర్టు జడ్జి శరత్‌ను సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ బాధ్యులు



జడ్జికి పూలమొక్క ఇస్తున్న పోలీసు కమిషనర్

ఖమ్మం లీగల్: న్యాయవాదులు తమను తాము నిత్యవిద్యార్థులుగా భావిస్తూ కొత్త విషయాలు నేర్చుకోవాలని హైకోర్టు న్యాయమూర్తి కె.శరత్ సూచించారు. ఖమ్మంలో శనివారం జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరైన హైకోర్టు జడ్జి ఖమ్మం బార్ అసోసియేషన్ హాల్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు ఖమ్మం సుపరిచితమని, ఈ ప్రాంతంతో విడదీయరాని బంధం ఉందని తెలిపారు. కాగా, న్యాయవాదులు నిరంతరం కొత్త అంశాలపై అధ్యయనం చేయడం ద్వారా వాదన పటిమ పెరుగుతుందని చెప్పారు. అనంతరం ఆయనను సన్మానించారు. న్యాయమూర్తులు వెంపటి అపర్ణ, ఎం.కల్పన, కాసరగడ్డ దీప, బిక్కం రజని, ఏపూరి బిందుప్రియ, రాళ్లబండి శాంతిలత, వినుకొండ మాధవితో బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శుల నేరెళ్ల శ్రీనివాసరావు, చింతనిప్పు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

- ఖమ్మంక్రైం: ఖమ్మం వచ్చిన హైకోర్టు న్యాయమూర్తి కాజా శరత్‌ను ఎన్నెస్పీ గెస్ట్‌హౌస్‌లో పోలీసు కమిషనర్ సునీల్‌దత్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు సీపీ పూలమొక్క అందించగా, పోలీసు సిబ్బంది గౌరవవందనం సమర్పించారు.

విద్యుత్ ఉద్యోగుల సంబురాలు



ఎస్ఈ కార్యాలయం వద్ద సంబురాల్లో పాల్గొన్న ఉద్యోగులు

ఖమ్మంవ్యవసాయం: పదోన్నతులు కల్పించిన నేపథ్యాన విద్యుత్ ఉద్యోగుల్లో సంబురాలు వెల్లువెత్తాయి. ఇటీవల ప్రభుత్వం విద్యుత్ ఉద్యోగుల పదోన్నతులకు శ్రీకారం చుట్టగా మొదటి దశలో జూనియర్ లైన్‌మెన్ల(జేఎల్‌ఎం)కు అసిస్టెంట్ లైన్‌మెన్లు(ఏఎల్‌ఎం)గా ఉద్యోగోన్నతి కల్పించారు. ఈ నేపథ్యాన ఉద్యోగులు ఖమ్మంలోని సర్కిల్ కార్యాలయం వద్ద శనివారం సంబురాలు జరుపుకున్నారు. డిప్యూటీ సీఎం, విద్యుత్‌శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. జేఏసీ చైర్మన్ టి.శేషగిరిరావు, కన్వీనర్ వై.సీతారాంగోపాల్‌తో పాటు ఎం.ప్రసాద్, శ్రీనివాస్, సురేష్, శ్రీధర్, రమేష్‌బాబు, నాగేంద్రకుమార్, వివేక్, రాజశేఖర్, సీహెచ్.ముకుందరెడ్డి, పుష్పవాణి తదితరులు పాల్గొన్నారు.

విధులకు హాజరుకాలేని వారు మెడికల్ బోర్డ్‌కు..

సింగరేణి(కొత్తగూడెం): అనారోగ్యంతో బాధపడుతూ విధులకు హాజరుకాలేని కార్మికులను మెడికల్ బోర్డ్‌కు రిఫరల్ చేసేలా ఏరియాల జీఎంలకు ఆదేశాలు జారీ చేయనున్నట్లు సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ వెల్లడించారు. కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ తాను ఏరియాల్లో పర్యటించిన సమయాన అనారోగ్యంతో బాధపడుతున్న వారు కలిసి సమస్యలు విన్నవించారని తెలిపారు. నడిచే స్థితిలో లేకపోవడంతో పాటు గనులు, విభాగాల్లో పనిచేసే శక్తిలేదని.. మెడికల్ బోర్డ్‌కు దరఖాస్తు చేస్తే సర్వీస్ నిబంధనల కారణంగా నష్టపోతున్నట్లు చెప్పారన్నారు. ఈనేపథ్యాన తీవ్రంగా ఇబ్బంది పడుతున్న వారి విషయంలో రెండేళ్ల సర్వీస్ నిబంధన తొలగించాలని కోరిన నేపథ్యాన జీఎంలు అలాంటి వారిని బోర్డ్‌కు రిఫర్ చేయాలని సీఎండీ సూచించారు. అలాగే, మెడికల్ బోర్డ్‌కు జాబితా ముందుగానే దళారుల చేతికి అందుతున్న విషయమై తాను ఆదేశాలు జారీ చేసినా మార్పు లేదని పేర్కొన్న సీఎండీ.. ఇకనైనా తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. అలాగే, ఏరియా కేంద్రాలు, కార్పొరేట్ కార్యాలయానికి రాకుండా కార్మికుల సమస్యలను ఎక్కడికక్కడే పరిష్కరించాలని సీఎండీ సూచించారు.